ప్రజాశక్తి

సోమవారం 22 జూలై, 2024 5 శ్రీకాకుళం



డెంగీ లక్షణాలతో విద్యార్థి మృతి



విఘ్నేష్ (ఫైల్)

ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి తిప్పన విఘ్నేష్ (21) డెంగీ లక్షణాలతో మృతి చెందారు. విశాఖపట్నంలోని ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఇటీవల వచ్చిన సెలవులకు సొంతూరు పట్టణంలోని దానంపేట వచ్చాడు. ఇంతలో జ్వరం రావటంతో మందులు తీసుకున్నాడు. జ్వరం తగ్గకపోవడంతో విశాఖలోని మెడికవర్ ఆస్పత్రికి వెళ్లారు. వైద్యులు పరీక్షలు అనంతరం డెంగీ లక్షణాలు ఉన్నాయని గుర్తించడంతో చికిత్స తీసుకున్నాడు. శనివారం రాత్రి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతుడు తండ్రి రమణయ్యరెడ్డి మాజీ సైకోద్యోగి. తల్లి రాణి, ఇద్దరు అక్కలు ఉన్నారు. చేతికి అందొచ్చే ఒక్కగానొక్క కుమారుడు తల్లిదండ్రుల కళ్లముందే మృతి చెండటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. విద్యార్థి మృతితో గ్రామస్తులు శోకసముద్రంలో మునిగిపోయారు.

ప్రజల గొంతుకవుతాం

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

నియోజకవర్గాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు తెలిపారు. ఈనెల 22 నుంచి వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో జిల్లా నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలకు తొలిసారి శాసనసభలో మాట్లాడే అవకాశం లభించనుంది. ఈనేపథ్యంలో తాము అసెంబ్లీలో ప్రస్తావించదలచిన అంశాలను ప్రజాశక్తికి తెలిపారు.

– ప్రజాశక్తి, విలేకరుల బృందం

సాగునీటి సమస్యపై ప్రస్తావిస్తా



గత ప్రభుత్వం వంశధార కాలువలు బాగు చేయకపోడంతో సాగునీరు అందక రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. వారి కష్టాలు దగ్గర ఉండి చూశాను. నియోజకవర్గంలో సాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను. వంశధార కాలువల ఆధునికీకరణ, కరకట్టల నిర్మాణం చేపట్టి శివారు ప్రాంతంలో ఉన్న ప్రతి ఎకరాకూ సాగునీరు అందించాలని శాసనసభ సమావేశాల్లో ప్రస్తావిస్తాను.

- బగ్గు రమణమూర్తి, నరసన్నపేట ఎమ్మెల్యే

బెంతు ఒరియాల సమస్యను లేవనెత్తుతా



అసెంబ్లీ సమావేశాల్లో బెంతుఒరియాల సమస్యను ప్రస్తావిస్తా. ఆ సామాజిక తరగతికి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో దీర్ఘకాలంగా సతమవుతున్నారు. గత ప్రభుత్వం నుంచి వారు ఆందోళన చేస్తున్నా, అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. కుల ధ్రువపత్రం లేకపోవడంతో ప్రభుత్వపరంగా అందాల్సిన సంక్షేమ పథకాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారు.

- బెందాళం అశోక్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే

ఆఫ్‌షోర్‌కు నిధులు కోరుతా



పలాస మండలంలోని రేగులపాడు వద్ద నిర్మాణం చేపడుతున్న ఆఫ్‌షోర్ రిజర్వాయరు అసంపూర్తిగా ఉండిపోయింది. గత ప్రభుత్వం దానిపై దృష్టిపెట్టలేదు. ఆ ప్రాజెక్టు నిధులు కేటాయించి నిర్మాణం పూర్తి చేసేందుకు అసెంబ్లీలో ప్రస్తావిస్తాను. కాశీబుగ్గ కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులు లేరు. వైద్యులు, సిబ్బంది నియామానికి, సదుపాయాల కల్పనపై ప్రస్తావిస్తాను. గత ప్రభుత్వం కిడ్నీ ఆస్పత్రిని కేవలం డయాలసిస్ కేంద్రంగానే మార్చింది. ఆస్పత్రిలో కిడ్నీ పరిశోధనపైనా చర్చిస్తా. కాశీబుగ్గ రైల్వే వంతెన అసంపూర్తిగా ఉండిపోయింది. ఏళ్లు గడిచినా పనులు పూర్తి కాలేదు. గత ప్రభుత్వం పూర్తి చేస్తామని చెప్పి చేతులెత్తేసింది. పలాస–కాశీబుగ్గ జంట పట్టణాల ప్రజలతో పాటు ఇతర మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. త్వరితగతిన రైల్వే వంతెన పనులు పూర్తి చేయడం పైనా మాట్లాడుతా.

- గౌతు శిరీష, పలాస ఎమ్మెల్యే

రైతుల సమస్యలను ప్రస్తావిస్తా



గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం రైతులను పూర్తిగా పట్టించుకోవడం మానేసింది. బాధ్యత లేని ప్రభుత్వం వల్ల రైతులు నష్టపోయారు. వంశధార ప్రాజెక్టు, కాలువలపై తీవ్ర నిర్లక్ష్యం కనబరిచింది. జిల్లాలోని రైతులకు ఐదేళ్లపాటు పూర్తిస్థాయిలో సాగునీరు అందకపోవడంతో పంటలు పండక ఇబ్బందులు పడ్డారు. సాగునీటి కాలువల శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తాను. రహదారుల సమస్య, శ్రీకాకుళం నగరపాలక సంస్థ అభివృద్ధి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వైద్యుల భర్తీ తదితర సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తాను.

- గొండు శంకర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే

రహదారుల దుస్థితిని వివరిస్తా



అసెంబ్లీ సమావేశాల్లో రహదారుల దుస్థితిని ప్రస్తావిస్తాను. రోడ్లు పాడైపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లుకు నిధులు మంజూరు చేయాల్సి ఉంది. పైడిభీమవరం పారిశ్రామికవాడ అభివృద్ధి మరింత అభివృద్ధి చేయాల్సి ఉంది. సాగు, తాగునీటి సౌకర్యాల కల్పనకు నిధులు కోరుతాను.

- ఎన్.ఈశ్వరరావు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే

ఐటిడిఎ ఏర్పాటు చేయాలని కోరుతా



జిల్లాల పునర్విభజన తర్వాత జిల్లాకు ఐటిడిఎ లేదు. పాతపట్నం నియోజకవర్గంలో గిరిజనులు ఎక్కువగా ఉన్నారు. ఐటిడిఐ ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో ప్రస్తావిస్తాను. ఉన్నత విద్య కోసం డిగ్రీ కళాశాల, అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతాను. గ్రామాలకు రహదారులు, తాగునీటి, రైతులకు సాగునీరు కల్పనకు నిధుల గురించి ప్రస్తావిస్తాను.

- మామిడి గోవిందరావు, పాతపట్నం ఎమ్మెల్యే

తెరిపిచ్చిన వాన

- **జలాశయాలకు జలకళ**
- **పంట పొలాల్లో నీరు**



బూర్జ మండలం లక్కువరంలో నీటమునిగిన పంట పొలాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లాలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు ఆదివారానికి తెరిపినిచ్చాయి. జిల్లావ్యాప్తంగా మబ్బుల వాతావరనం నెలకొంది. పలు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరి పంట పొలాలు నీటమునిగాయి. వంశధార, నాగావళి, మహేంద్రతనయ, బాహుదా నదులతో పాటు పలు వాగులు, వంకల్లో భారీగా వర్షపు నీరు చేరడంతో పంట కాలువల్లో సైతం జలకళ మొదలైంది. జలాశయాలకు నీరు చేరింది. వాగుల్లో ప్రవాహం పెరగడం వల్ల లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పంట పొలాల్లో వర్షపు నీరు భారీగా చేరింది. జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురవడంతో రైతులు ఖరీఫ్ పనుల్లో నిమగ్నం కానున్నారు.

నీటమునిగిన నారుమళ్లు

జిల్లావ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు నదులతో పాటు వాగుల్లో నీటి ప్రవాహం పెరగడంతో లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరింది. సంతబొమ్మాళి, సోంపేట బీల ప్రాంతాలతో పాటు సమీప పంట పొలాల్లో వరద నీరు భారీగా చేరింది. దీంతో పంట పొలాలు సైతం నీటితో నిండుకుండలా కనిపిస్తున్నాయి. శ్రీకాకుళం, గార మండలాల్లో కిష్టప్పపేట, బూరవల్లి మధ్య పంట పొలాల్లో భారీగా నీరు చేరింది.

నిలకడగా నాగావళి, వంశధార

వంశధార, నాగావళి నదుల్లో వరద నీటి ప్రవాహం నిలకడగా ఉంది. కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎగువనున్న ప్రాంతం నుంచి నదుల్లోకి వరద నీరు పోటెత్తుతోంది. దీంతో వంశధార కుడి, ఎడమ కాలువల ద్వారా సాగుకు నీరందిస్తున్నారు. ఆదివారం సాయంత్ర ఆరు గంటల సమయానికి వంశధార నదిలోకి 2,888 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో 1108 క్యూసెక్కుల నీటిని ఎడమ కాలువకు, 350 క్యూసెక్కుల నీటిని కుడి కాలువకు విడుదల చేస్తున్నారు. ఆరు గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు విడిచి పెడుతున్నారు. గొట్టాబ్యారేజీ వద్ద నీటి నిల్వలు భారీగా పెరిగిన తర్వాత మిగిలిన గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తారు. ఒడిశా భూభాగంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. నాగావళి నదిలో రెండు వేల క్యూసెక్కులకు పైగా తోటపల్లి వద్ద నీటిని విడుదల చేశారు. మిగిలిన రెల్లి గెడ్డ ఇతర వాగుల నుంచి వస్తున్న నీటిని నారాయణపురం ఎడమ కాలువకు మళ్లించారు.

వంశధార జలాశయానికి వరద నీరు

వంశధార ప్రాజెక్టు పరిధిలోని హిరమండలం రిజర్వాయర్‌కు ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు వచ్చి చేరుతోంది. వంశధార నది నుంచి ఫ్లడ్ ఫ్లో కెఆల్ ద్వారా నీటిని మళ్లించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వంశధార ఎస్ఇ రాంబాబు తెలిపారు.

తీర ప్రాంతవాసులు అప్రమత్తం

ఈనెల 25వ తేదీ వరకు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని విశాఖపట్నం తుపాను హెచ్చరికల కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలలు మూడు మీటర్ల ఎత్తున ఎగసిపడతాయని పేర్కొంది. కవిటి, రామచంద్రాపురం మధ్య వీటి ఉధృతి మరింత ఎక్కువగా ఉంటుందని తెలిపింది. తీరం వెంబడి 45 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది.

గుంతల్లో నీరు... రాకపోకలు ఎలా?

కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు చేరడంతో కొన్ని ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ప్రధానంగా శ్రీకాకుళం - ఆమదాలవలస రోడ్డులో కొత్తరోడ్డు నుంచి వాకలవలస మధ్య గోతుల్లో నీరు చేరింది. పూండీ, నౌపడ రోడ్డు కూడా గోతులమయంగా ఉంది. ఉద్దాన ప్రాంతంలో పలు రోడ్లు దెబ్బతిన్నాయి. రోడ్ల మధ్యలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో వాటిలో వర్షపునీరు చేరి వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

తీర్థయాత్రలకు ప్రత్యేక ఎయిర్ ప్యాకేజీ

ఐఆర్‌సిటిసి ఆర్ఎం క్రాంతి సావర్కర్

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సిటిసి) ప్రత్యేక ఎయిర్ ప్యాకేజీలను విశాఖపట్నం నుంచి ప్రారంభించినట్లు ఐఆర్‌సిటిసి ఆర్ఎం డాక్టర్ క్రాంతి పి.సావర్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐఆర్‌సిటిసి ఆధ్వర్యాన దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలతో పాటు పర్యాటక కేంద్రాలను సందర్శించే యాత్రికుల సౌకర్యార్థం ప్రత్యేక ఎయిర్ ప్యాకేజీలను ప్రకటించినట్లు వివరించారు. 'ఆకర్షణీయమైన థాయిలాండ్' పర్యటన ఐదు రాత్రులు, ఆరు రోజులు ఉంటుందని తెలిపారు. ఈ పర్యటన సెప్టెంబరు ఏడో తేదీన బయలుదేరి 12వ తేదీ వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈ పర్యటనలో సందర్శించే ప్రదేశాలు పట్టాయాలో నాంగ్‌నూచ్ గార్డెన్, అల్కాజర్ షో కోరల్ ఐలాండ్, సఫారీ వరల్డ్ టూర్, డిన్నర్‌తో రివర్ క్రూజ్, బ్యాంకాక్‌లోని గోల్డెన్ బుద్ధ, మార్బుల్ బుద్ధ, శ్రీ రాధా టైగర్ జూ వంటి ప్రదేశాలు సందర్శించనున్నట్లు తెలిపారు. ఈ ప్రయాణానికి ఎయిర్ ప్యాకేజీ ధరలు ఒక వ్యక్తికి రూ.66,735, డబుల్ ఆక్యుపెన్సీ రూ.57,815, ట్రిపుల్ ఆక్యుపెన్సీ రూ.57,815 ఉంటుందని వివరించారు. ప్రయాణ బీమా కూడా ఉంటుందని తెలిపారు.

దక్షిణ దివ్య ఆలయ పర్యటన ఐదు రాత్రులు, ఆరు రోజులు ఉంటుందని తెలిపారు. ఈ పర్యటన ఆగస్టు 14 నుంచి 19వ తేదీ వరకు ఉంటుందని వివరించారు. ఈ పర్యటనలో మదురై మీనాక్షి అమ్మన్ ఆలయం, రామేశ్వరంలోని రామనాథస్వామి ఆలయం, ధనుష్కోటి, కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్, త్రివేండ్రంలోని శ్రీ పద్మనాభస్వామి ఆలయం వంటి ప్రదేశాలు సందర్శించనున్నట్లు తెలిపారు. ఈ ప్రయాణానికి సింగిల్ ఆక్యుపెన్సీ రూ.51,400, డబుల్ ఆక్యుపెన్సీ రూ.39,880 ట్రిపుల్ ఆక్యుపెన్సీ రూ.38,005 ఉంటుందని వివరించారు. ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో ఎకానమీ క్లాస్ విమానం టిక్కెట్లు ఎసి హోటల్, వసతి ఐదు బ్రేక్‌ఫాస్ట్‌లు ఐదు డిన్నర్లు ప్రయాణ బీమా, టూర్ మేనేజర్ సేవలు ఉంటాయని తెలిపారు. నేరుగా టిక్కెట్స్ బుక్ చేయాలనుకునే వారు ఐఆర్‌సిటిసి, ప్రధాన ప్రవేశ ద్వారం, గేటు నంబరు–1, రైల్వేస్టేషన్, విశాఖపట్నం–530004 సంప్రదించాలని తెలిపారు. ఎవరికి ఎటువంటి సమాచారం కావాల్సి ఉన్న www.irctc-tourism.comలో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. చందన్ కుమార్ 9281030748, సాయిప్రసాద్ 9281495847, కె.వి రావు 9550166168 మొబైల్ నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

సబ్సిడీపై సరుకులు

- **రేషన్ డిపోల ద్వారా అందించేందుకు ఏర్పాట్లు**
- **తక్కువ ధరకే కందిపప్పు**
- **వచ్చే నెల నుంచి పంపిణీ**

ప్రజాశక్తి– శ్రీకాకుళం

రేషన్ కార్డుదారులకు రాయితీపై నిత్యావసర సరుకులు అందించేందుకు చంద్రబాబు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతంలో రాయితీపై రేషన్ కార్డుదారులకు ఇచ్చే కందిపప్పును గత వైసిపి ప్రభుత్వం ఏడాది కాలంగా ఇవ్వడం ఆపేసింది. అప్పుడప్పుడూ పంచదార ఇస్తూ, కేవలం బియ్యం పంపిణీకే పరిమితమైంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెల్ల రేషన్‌కార్డుదారులకు రాయితీపై నిత్యావసర సరుకుల పంపిణీపై ప్రత్యేక దృష్టిసారించారు. బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలను దృష్టిలో పెట్టుకుని రేషన్ దుకాణాల ద్వారా పలురకాల సరుకులు ఇవ్వాలని నిర్ణయించారు. ఆగస్టు నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. బియ్యంతో పాటు రాయితీపై కందిపప్పు, పంచదార, గోధుమపిండిని ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే రాష్ట్రంలో టెండర్లు పూర్తయ్యాయి. కందిపప్పు, గోధుమపిండి, పంచదార పౌరసరఫరాల గిడ్డంగులకు పంపుతున్నట్లు తెలిసింది. ప్రధానంగా బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.180 వరకు ఉండడంతో పేదలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. రైతుబజారులో రాయితీపై రూ.160కు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో రేషన్ డిపోల ద్వారా కందిపప్పును మరింత రాయితీపై కిలో రూ.67కే ఇవ్వనున్నారు. ఆగస్టు నుంచి మూడు నెలలకు సరిపడా కందిపప్పు, పంచదార, గోధుమపిండిని కార్డుదారులకు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

ఎర్రన్న విద్యాసంకల్పం విజయవంతం

650 మంది హాజరు



పలాస : పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న బాబూరావు

ప్రజాశక్తి– శ్రీకాకుళం అర్బన్, పలాస

ప్రతిభావంతులైన నిరుద్యోగ యువత పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు తోడ్పాటునందించాలనే ఉద్దేశంతో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శ్రీకారం చుట్టిన ఎర్రన్న విద్యా సంకల్పం కార్యక్రమం వరుసగా రెండో ఏడాది విజయవంతమైంది. ప్రతిభ చూపిన విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు అందజేయాలని నిర్ణయించిన ఈ పరీక్షకు జిల్లావ్యాప్తంగా 650 మంది హాజరయ్యారు. శ్రీకాకుళంలోని విద్యాధరి డిగ్రీ కళాశాల, పలాసలోని మదర్ థెరిసా పాఠశాల, టెక్కలి విశ్వజ్యోతి డిగ్రీ కళాశాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. పరీక్ష ద్వారా ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు పంపిణీ చేయనున్నారు.

జిల్లాను విద్యాపరంగా అభివృద్ధి చేసేందుకు తన తండ్రి ఎర్రన్నాయుడు కృషి చేశారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఉన్నత విద్యనభ్యసించిన నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చేలా తమవంతు సహాయం అందించాలని ఈ కార్యక్రమానికి సంకల్పించామన్నారు. విద్యావ్యవస్థలో అత్యంత అనుభవం కలిగిన వారితో ఎర్రన్న విద్యా సంకల్పం పరీక్ష ప్రణాళిక రూపొందించామని వివరించారు. గతేడాది కోటబొమ్మాళిలో జూన్ పదో తేదీన దీన్ని ప్రారంభించామని, వరుసగా రెండో ఏడాదీ దీన్ని నిర్వహించడం ద్వారా డిఎస్‌సి, గ్రూప్–1, 2, పోలీసు నియామక పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ఈ ప్రతిభా పరీక్ష ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు.

ఎమ్మెల్సీ హరిప్రసాద్‌ను కలిసిన విశ్వక్సేన్

ప్రజాశక్తి– లావేరు

ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ రాజకీయ కార్యదర్శిగా పనిచేసిన పిడుగు హరిప్రసాద్‌ను ఎచ్చెర్ల జనసేన ఇన్‌ఛార్జి డాక్టర్ విశ్వక్సేన్ ఆదివారం మంగళగిరి జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి పార్టీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆకాంక్షించారు. ఈయనతో పాటు రణస్థలం జనసేన మండల అధ్యక్షుడు బస్వా గోవిందరెడ్డి, లావేరు జనసేన నాయకుడు కాకర్ల బాబాజీ తదితరులున్నారు.

క్రమం తప్పకుండా సదరం ధ్రువీకరణ

- **శిబిరాల ద్వారా అన్నిరకాల వైకల్యాలకు ఉపకరణాలు**
- **మానసిక ధైర్యం కల్పించేందుకు పూర్తి సహకారం**
- **వికలాంగుల సంక్షేమశాఖ ఎడి కె.కవిత**





ప్రజాశక్తి– శ్రీకాకుళం అర్బన్

అంగవైకల్యం ఉన్నంత మాత్రాన వారిపై చిన్న చూపు తగదని వికలాంగుల సంక్షేమశాఖ ఎడి కె.కవిత అన్నారు. మానవ వనరుల్లో అంతర్భాగమేనని చెప్పారు. వారికి అండగా నిలిచేందుకు జిల్లాలో వికలాంగుల సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. వికలాంగులు, హిజ్రాలకు ప్రత్యేక శిబిరాల ద్వారా నిరంతరాయంగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. పలు అంశాలపై ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

? వికలాంగుల సంక్షేమానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ప్రధానంగా అంగవైకల్యం ఉన్న వారు మానసికంగా దృఢంగా ఉండేలా మనోధైర్యాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నాం. అందులో భాగంగా బదిరులు, చెవిటి, మూగ, అంధులు, చేతులు, కాళ్ల అంగవైకల్యంతో బాధపడుతున్న వారిని గుర్తించాం. చెవిటి వారిని వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి గ్రామంలో గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాం. ఈ సర్వే ఆధారంగా జిల్లాలో 36 వేల మంది వరకు వికలాంగులు ఉన్నారని గుర్తించాం. వారిలో అవసరమున్న వారికి గతంలో పరికరాలు అందించాం. ఈ ఏడాదీ కేంద్ర ప్రభుత్వ సహకారంతో శిబిరాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించేందుకు సహకారాన్ని కోరాం.

? బదిరులకు టచ్ ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు ఎంతమేరకు ఇచ్చారు?

జిల్లాలో సుమారు 12 వందల మంది వరకు బదిరులు ఉన్నట్టు గుర్తించాం. వారిలో చెవుడు, మూగ ఉన్న బదిరులు, ఒక్క మూగ వారు ఉన్నారు. వారిలో వివిధ తరగతుల్లో చదవుకున్న వారూ ఉన్నారు. గతంలో వీరికి చదువు కునేందుకు అవకాశాలు తక్కువగా ఉండేవి. బదిరుల పాఠశాలలు అందుబాటులోకి వచ్చిన తర్వాత చదువుకున్న వారి సంఖ్య పెరిగింది. వీరిలో జ్ఞాపకశక్తి అధికంగా ఉంటుంది. సాంకేతిక వినియోగించడంలోనూ వీరు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. చదువుకున్న వారికి మరింత సాంకేతికంగా చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. అందులో భాగంగా 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు ఉన్న బదిరులందరికీ టచ్‌ఫోన్లు , లాప్‌ట్యాప్‌లు ఇస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా ఉన్న 18 నుంచి 40 ఏళ్ల లోపు వయసు కలిగి పదో తరగతి, ఆపై తరగతులు చదువుతున్న విద్యార్థులతో పాటు చదువు పూర్తిచేసిన బదిరులకు వీటిని అందజేస్తున్నాం. అవసరమున్న వారు ధ్రువపత్రాలను ఆన్‌లైన్ ద్వారా apdascac.ap.gov.in అనే వెబ్‌సైట్‌కు వారు పంపాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకునే బదిరులు మెడికల్ బోర్డు నుంచి పొందిన సదరం ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ప్రభుత్వ ఆడియోలజిస్టు నుంచి పొందిన సైన్ లాంగ్వేజ్ ధ్రువపత్రం, పదో తరగతి, ఆ పై తరగతులు చదువుకున్న ధ్రువపత్రాలు దరఖాస్తులతో పాటు అప్‌లోడ్ చేయాలి. వాటిని పరిశీలించిన తర్వాత అర్హులను గుర్తించి టచ్‌ఫోన్లు ఇచ్చేందుకు చర్యలు చేపడతాం. ప్రస్తుతం అప్‌లోడ్ ప్రక్రియ కొనసాగుతోంది.

? సదరం ధ్రువీకరణ పత్రాల జారీపై ఎలాంటి శ్రద్ధ చూపుతున్నారు?

జిల్లాలో వికలాంగులను ధ్రువీకరించడానికి సదరం క్యాంపులు నిర్వహిస్తున్నాం. లబ్ధిదారులు ముందుగా ఆన్‌లైన్‌లో స్లాట్ తీసుకుని వారికి కేటాయించిన ప్రదేశంలో వారికి కేటాయించిన తేదీల్లో సదరం క్యాంపులకు హాజరు కావాల్సి ఉంటుంది. మండల కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశాం. మెడికల్ బోర్డు ముందు హాజరై పరీక్షించుకున్న తర్వాత అంగవైకల్యం ఎంత శాతం ఉందో గుర్తించి ధ్రువీకరణ పత్రాన్ని సదరం ద్వారా మంజూరు చేస్తారు. ఈ ధ్రువీకరణ పత్రం ఆధారంగానే సంక్షేమ పథకాలతో పాటు రిజర్వేషన్, ఇతర రాయితీలు పొందడానికి వీలవుతుంది. అందుకోసం వారిలో అవగాహన కల్పించడం జరుగుతోంది.

? బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ఏ మేరకు చేపడుతున్నారు?

ప్రభుత్వ శాఖల్లో వికలాంగులకు రిజర్వు చేయబడిన ఉద్యోగాల్లో ఖాళీలను బట్టి ఆరు నెలలకొక మారు బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తిస్తాం. అంగవైకల్యం ఉండి విద్యార్హత ఉన్న వారికి మాత్రమే ఈ ఖాళీల్లో నియమించడానికి వీలవుతుంది. జిల్లాస్థాయిలో ఎంపిక కమిటీ పర్యవేక్షణలో నియామకాలు జరుగుతాయి. అయితే ప్రస్తుతం ఖాళీలను గుర్తించడానికి వీలుగా ప్రభుత్వశాఖల వారీగా జాబితాలను తయారు చేయాలని కలెక్టర్ నుంచి ఆదేశాలున్నాయి. ఈ ఆదేశాలకు అనుగుణంగా ఖాళీలను గుర్తిస్తున్నాం. రిజర్వేషన్, రోస్టరు విధానంలో ఎంపికచేస్తాం. ఖాళీలను భర్తీ చేయడానికి ముందు నోటిఫికేషన్ విడుదల చేస్తాం.

? నకిలీపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సదరం ధ్రువీకరణకు ఆస్పత్రి స్థాయిలో వైద్యుల కమిటీ నిర్ణయిస్తుంది. ఇటీవల వచ్చిన ఫిర్యాదులపై ఇప్పటికే కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ విచారణకు ఆదేశించారు. జిల్లాలో జారీ అయిన సదరం ధ్రువీకరణ పత్రాలన్నింటినీ పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వైద్య బృందంతో ఇప్పటికే సమావేశం నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం పరిశీలన కొనసాగుతుంది.



సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

గ్రామాల అభివృద్ధిపై దృష్టి

ప్రజాశక్తి- పోలాకి

గ్రామాల అభివృద్ధిపై దృష్టిసారించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. మండలంలోని మబగాం క్యాంప్ కార్యాలయంలో నాలుగు మండలాల అధికారులతో ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. సాగు, తాగునీటి సరఫరా, వ్యవసాయ బోరకు విద్యుత్ సరఫరా లేదని సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యరకమంలో ధర్మాన తేజకుమార్, భైరి భాస్కరరావు, కత్తిరి వెంకటరమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

జాబ్‌మేళాకు స్పందన

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సౌజన్యంతో డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీ రిక్రూట్మెంట్ డ్రైవ్ ఆదివారం నిర్వహించారు. రాష్ట్రంలో నలుమూలల నుంచి అభ్యర్థులు ఈ రిక్రూట్మెంట్ డ్రైవ్‌కి విచ్చేశారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రతినెల ఏదో ఒక పరిశ్రమ తీసుకువచ్చి ఉద్యోగాలు ఇచ్చే కార్యక్రమం చేపడుతున్నామని, అందులో భాగంగా డాక్టర్ రెడ్డీ వారితోని ఈ రిక్రూట్మెంట్ డ్రైవర్ నిర్వహిస్తున్నామని అన్నారు. 300 మంది హాజరైయ్యారు. వీరిలో 60 మందికి ఉద్యోగాలు కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ క్లస్టర్ హెడ్ కె.వి.ఎస్.ఎన్.రాజు, జిఎం లక్ష్మీ దుర్గ, హెచ్ఆర్ దీపక్ పాల్గొన్నారు.

క్రీడా నిబంధనలపై అవగాహన

పలాస: మారిన క్రీడా నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని టెన్నీకాయిట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పి.తవిటయ్య అన్నారు. పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొదటి జోన్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబరులో జరగనున్న పాఠశాల క్రీడల సమాఖ్య పోటీలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పించి క్రీడల్లో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తవిటయ్యకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మొదటి జోన్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, కార్యదర్శి పి.గజేంద్ర, వివిధ మండలాల క్రీడా నిర్వాహకులు సిహెచ్.పద్మలోచనం, ఎస్. రామారావు, కె.రామారావు, బి.తిరుమల, దామోదర్, ఎస్. చంద్రశేఖర్ పండా, కార్తికేయ చౌదరి, పి.కృష్ణ, ఎస్.వి.జోగారావు పాల్గొన్నారు.

పేరుకుపోయిన గుర్రపుడెక్క



కిల్లాం వద్ద వంశధార కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో చాలా గ్రామాలకు చెందిన చెరువుల్లోను, ప్రధాన కాలువల్లో గుర్రపుడెక్క పేరుకుపోయింది. మండలంలోని దీర్ఘాశి, మబగాం చెరువు, కాలువలో గుర్రపుడెక్కను తొలగించాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్‌ను ప్రారంభమైంది. ఇప్పటికీ సరైన వర్షాలు లేక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ ఏడాది పంటలకు నీరు అందించేటట్టు కృషి చేస్తామని ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రకటనలు చేశారు. కానీ, గ్రామస్థాయిలో పనులు జరగడం లేదన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సుమారు 20 వేల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. ఎగువ ప్రాంతంలో జలుమూరు మండలం దూగాం ప్రాంతంలో నీరు నిలుపుదల చేయడంతో దిగువ ప్రాంతాలకు నీరు రావడం లేదని రైతులు పాకోటి అప్పారావు, రామారావు, చిలకన్న తెలిపారు. ఇప్పటికైనా వంశధార అధికారులు స్పందించి చెరువుల్లో, కాలువల్లో పేరుకు పోయిన పూడికలను తొలగించి సాగునీరు అందించాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఈ విషయంపై జెఇ శ్యామలరావు వద్ద ప్రస్తావి ంచగా పూడికలు తొలిగించేందుకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.



మబగాం చెరువులో నిండి ఉన్న గుర్రపుడెక్క



ఆమదాలవలస: ఆహార పొట్లాలను పంపిణీ చేస్తున్న చిన్ను

పలుచోట్ల అన్నదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని విశాఖ ఎ కాలనీలో శిర్డీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం ప్రధాన అర్చకులు రేజేటి శ్రీనివాసచార్యులు ఆధ్వర్యాన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయంలో విశేష సేవల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 1500 మందికి అన్న ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షులు మధుకర్ విలేకర్, సభ్యులు కొంక్యాన మురళి, ఇప్పిలి భవాని తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: శ్రీకాకుళం పట్టణంలో నివాసం ఉంటున్న దుంపల జగదీష్, స్వప్న దంపతులు గురు పౌర్ణమి సందర్భంగా కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 40 మంది అనాథలు, వికలాంగులు, వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృత్విక్ ఫౌండేషన్ ఫౌండర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను), లక్ష్మణ్, సుబ్బు, ఉమామహేష్, మణి, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని రాపాకలో వరలక్ష్మి అమ్మవారి పేరంటాల ఆలయం వద్ద ఆదివారం గురుపౌర్ణమి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పరిసర గ్రామాలకు చెందిన వేలాదిమంది యాత్రికులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన చిన్నారుల కోలాటం ఎంతగానో ఆకట్టుకుంది.

టెక్కలి రూరల్ : మండలంలోని షిర్డీ సాయి ఆలయ వద్ద గురు పౌర్ణమి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కె.కొత్తూరుకు చెందిన రావాడ భుజంగరావు ఆధ్వర్యాన రెండు వేల మందికి అన్నదానం చేశారు. అలాగే శంభాన వీధిలో మోణింగి సురేష్ ఆధ్వర్యాన మూడు వేల మందికి, కచేరి వీధిలో 2 వేల మందికి అన్నదానం చేశారు.

నౌపడ : నౌపడ శివాలయం దరి శిర్డీ సాయి ఆలయంలో గురు పౌర్ణమి వేడుకల్లో భాగంగా 2 వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ సాయిరాం మందిరాన్ని గురుపౌర్ణమి సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, మదర్ థెరిసా పాఠశాల కరస్పాండెంట్ వజ్జ గంగా భవాని, పలు వార్డుల కౌన్సిలర్లు దర్శించుకున్నారు. అనంతరం సుమారు ఏడు వేల మందికి అన్నదానం కార్యక్రమం చేపట్టారు.



పొందూరు : రాపాకలో చిన్నారుల కోలాట నృత్యం

న్యాయం జరిగే వరకు పోరాటం

ప్రజాశక్తి- కవిటి

తమకు శాశ్వత తరగతి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసి, తమ బిడ్డలకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని బెంతు ఒరియా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సుమన్ బిసాయి అన్నారు. తమ సమస్యల పరిష్కారానికి బెంతు ఒరియాలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 209వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ తమకు తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో విద్యార్థులు, నిరుద్యోగులు తమ విలువైన అవకాశాలు కోల్పోయి, వెనుకబాటుకు గురవుతున్నారని అన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడిన బెంతు ఒరియా మహిళలు చాలావరకు ప్రభుత్వ పథకాలకు దురమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



దీక్షలో పాల్గొన్న కుల పెద్దలు



మాట్లాడుతున్న ఫోరం నాయకులు

జీవశాస్త్రాన్ని సమగ్రంగా బోధించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జీవశాస్త్రాన్ని సమగ్రంగా బోధించాలని జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం జిల్లా అధ్యక్షులు పుట్టా ఉదయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం ప్రాంతీయ సమావేశం సోంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవశాస్త్ర ఉపాధ్యాయులుగా ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే విధంగా కృషి చేయాలన్నారు. ఎపి బిఎస్‌టిఎఫ్ రాష్ట్ర నాయకులు ప్రమోద్ కుమార్ పాడి మాట్లాడుతూ ప్రస్తుతం ఆరు నుంచి పదవ తరగతి వరకు ఉన్న జీవశాస్త్ర పాఠ్యాంశాలను పాఠ్యపుస్తకాలకు పరిమితం కాకుండా అదనపు సమాచారంతో విపులంగా బోధించి సమగ్రమైన అవగాహనను విద్యార్థుల్లో కల్పించాలని పిలుపునిచ్చారు. బిఎస్‌టిఎఫ్ రాష్ట్ర నాయకులు, జనవిజ్ఞాన వేదిక విద్యా విభాగం రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్ మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథానికి ప్రాతిపదికైన చార్లెస్ డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని సిలబస్ నుంచి తొలగించడం, అశాస్త్రీయ భావనలకు కారణమవుతుందని, శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించే పాఠ్యాంశాలను సిలబస్‌లో తిరిగి పొందుపర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశానికి ఒడియా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ దుర్గాప్రసాద్ చౌదరి అతిథిగా హాజరయ్యారు. జీవశాస్త్ర ఉపాధ్యాయుల డైరీని నాయకులు ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా అకడమిక్ సెల్ నాయకులు మురళీ దుల్లై, కోశాధికారి వి.త్రివిక్రమరావు, జిల్లా ఉపాధ్యక్షులు గగన కుమారి, సహ కార్యదర్శి మంచు కవిత కుమారి, వివిధ మండలాల నాయకులు చక్రధర్, జి.ప్రకాష్. గోపాలకృష్ణ, అమర రవికుమార్, ప్రసాద్, ఐదు మండలాల జీవశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం సోంపేట నాయకులుగా జి.ప్రకాష్, బి.చక్రధర్, ఇచ్ఛాపురం నాయకులుగా ఎ.రవికుమార్, పి.మోహనరావు, ఎం.ఈశ్వరి, కవిటి నాయకులుగా పి.ప్రసాద్‌బాబు, గిరిబాబు, మందస నాయకులుగా దీనబంధు, సాంబమూర్తి, కంచిలి నాయకులుగా ఎస్.గోపాలకృష్ణ, టి.మన్మధరావు బాధ్యతలు తీసుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు - జి.సిగడాం రైల్వేస్టేషన్ మధ్య గల వాండ్రంగి రైల్వేగేట్ సమీపంలో ఆదివారం రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు జిఆర్‌పి ఎస్ఐ మధు సూదనరావు తెలిపారు. మృతుడిని గుర్తించేందుకు ఎటువంటి ఆనవాళ్లు లేవని, ఆయన వద్ద పాన్ మసాలా డబ్బా ఉందని పేర్కొన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వాళ్లు ఈ కింది ఫోన్ నెంబర్ 9493474582 సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

పలాస: పలాస, మందస రైల్వే స్టేషన్ మధ్య గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (50) మృతి చెందినట్లు పలాస రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.



చికిత్స పొందుతున్న విద్యార్థి

వసతిగృహ విద్యార్థికి గాయాలు

కోటబొమ్మాళి: మండలంలోని కురుడు వసతిగృహానికి చెందిన ఎనిమిదో తరగతి చదువుతున్న పిట్ట జనక మోహనరావు గాయపడ్డాడు. ఆదివారం సెలవు కావడంతో మైదానంలో కబడ్డీ ఆడారు. ఆ ఆటలో మోహనరావు చెయ్యి విరిగిపోయింది. వెంటనే వసతిగృహాధికారి టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వినోద్‌కుమార్ ప్రథమ నిర్వహించి పిండి కట్టు వేశారు.

శ్యాంసుందరరావు ఔదార్యం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల



సందీప్‌కు మొబైల్‌ను అందజేస్తున్న శ్యామ్

ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేట పంచాయతీ నవభారత్ నగర్ కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై మురపాకకు చెందిన డిఫెన్స్ ఉద్యోగి సందీప్ రూ.25వేలు విలువ చేసే మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. అదే రహదారిలో ఉదయాన్నే వాకింగ్‌కి వెళ్తున్న నవభారత్‌నగర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పైడి శ్యాంసుందరరావు (శ్యామ్)కు ఆ ఫోన్ దొరికింది. దీంతో ఆ మొబైల్‌ను పోగొట్టుకున్న సందీప్‌కు అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నాడు. దీంతో గ్రామస్తులు, కాలనీవాసులు ఆయన ఔదార్యాన్ని అభినందించారు.

నమూనా శ్మశానవాటిక చిత్రం విడుదల

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యాన నమూనా శ్మశానవాటిక మహాప్రస్థానం భవన నిర్మాణ ప్రణాళిక 3డి చిత్రం విడుదల చేశారు. దీనిపై రోటరీ భవనంలో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రస్తుత ఉన్న నిర్మాణం, వేచి ఉండే ప్రదేశం, బూడిద భద్రతా లాకర్ గది, సంప్రదాయ దహన బ్లాక్, ప్రతిపాదన అభివృద్ధి దహన కేంద్రం, ప్రవేశ ద్వారం, శరీరం దహనం గ్యాస్, ఫర్నల్ యంత్రం, దహన గ్యాస్ ఫర్నల్ భవనం, పచ్చదనం, ప్రకృతి దృశ్యం, బహిరంగ స్నాన ప్రాంతం, శివుని విగ్రహం ఉందని సభ్యులు తెలిపారు. ఒక దహన సంస్కారానికి రెండు చెట్లు అవసరం అవుతుందని, కానీ, అదే చెట్టు ఎదగడానికి తక్కువలో 15 సంవత్సరాలు పడుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల కొంత పర్యావరణాన్ని పరిరక్షించేందుకు తోడ్పడుతుందని చెప్పారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతీ దివ్య, పట్టణ కౌన్సిలర్ల సూచనలు, సహాలు తీసుకున్నారు. కార్యరకమంలో రోటరీ క్లబ్ సెక్రెటరీ పైడిశెట్టి దినేష్‌కుమార్, ప్రాజెక్టు చైర్మన్ డాక్టర్ వేదవ్యాస పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న నాగేంద్రబాబు

జన సైనికులకు అండగా ఉంటాం

పోలాకి: జనసేన కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని నాగేంద్రబాబు అన్నారు. మండలంలోని బెలమరకు చెందిన క్రియాశీలక జనసేన సభ్యుడు మద్దు పురుషోత్తమరావు ఇటీవల ప్రమాదంలో మృతి చెందారు. మృతుని కుటుంబానికి విజయవాడలో నాగేంద్ర బాబు రూ.5 లక్షల చెక్కును ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జన సైనికుడిని కోల్పోవడం బాధగా ఉందన్నారు. కార్యక్రమంలో నరసన్నపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బలగ ప్రవీణ్‌కుమార్, మండల అధ్యక్షుడు నందుపిల్లి దండాశి, ఐటి కో-ఆర్డినేటర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

ఎర్ర చెరువు రోడ్డు పరిశీలన

పలాస: పలాస ఎర్ర చెరువు రోడ్డు అధ్వానంగా తయారైందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు అన్నారు. పలాస 24, 31 వార్డుల్లో ఆదివారం శుభోదయం, పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎర్ర చెరువు రోడ్డుపై గోతులపై, కాలువపై పలకలు పాడయ్యాని, తక్షణమే బాగు చేయాలని కోరారు. ఈ సమస్యలను ఎమ్మెల్యే గౌతు శిరీష, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌కు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సప్ప నవీన్, సప్ప చిరంజీవులు, కొరికాన శంకరరావు, అంబటి కృష్ణమూర్తి, యాల్ల బుడ్డు, దడియాల నర్సింహులు, కొరికాన వైకుంఠ, దాసరి విజయ్ పాల్గొన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న బాబూరావు

సంక్షిప్త వార్తలు

స్నేహితుని కుటుంబానికి ఆర్థికసాయం

బూర్జ: మండలంలోని డొంకలపర్తకు చెందిన తండేల మధు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. చిన్ననాటి నుంచి కలిసిమెలిసి తమతో తిరిగిన స్నేహితుడు అకాల మరణం చెందడంతో గ్రామ యువత ఆ కుటుంబానికి తమవంతుగా రూ.30 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు.

అరసవల్లికి రూ.లక్ష విరాళం

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి లావేరుకు చెందిన డి.లక్ష్మణరావు, ఆదిలక్ష్మి, నాగమణి దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఆలయ ఇఒ ఎస్.చంద్రశేఖర్‌కు ఆదివారం అందజేశారు. కుటుంబసభ్యులతో కలసి ఆలయాన్ని సందర్శించిన అనంతరం ఇఒను కలిసి చెక్కును అందజేశారు. అలాగే ఆలయాన్ని విశాఖపట్నం ఎఎస్‌పి (విజిలెన్స్) ప్రసన్న కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతించారు. ఆలయ సందర్శన అనంతరం వారికి శేష వస్త్రాలను కప్పి చిత్రపటాన్ని అందజేశారు.

అలాగే సూర్యనారాయణ స్వామి ఆలయానికి ఆదివారం రద్దీ తగ్గడంతో ఆదాయం రూ.2.71 లక్షల మేరకు లభించింది. టికెట్ల విక్రయాల ద్వారా రూ.57,300, విరాళాల రూపంలో రూ.73,813, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1,40,724 ఆదాయం సమకూరినట్టు ఇఒ చంద్రశేఖర్ తెలిపారు.

జనసైనికుల ఆర్థికసాయం

వజ్రపుకొత్తూరు: జనసైనికులు పేద కుటుంబానికి ఆర్థికసాయం చేసి అండగా నిలిచారు. మండలంలోని బైపెల్లికి చెందిన తామడ దుర్యోధన, పార్వతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. తల్లిదండ్రులు కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న ఆడ పిల్లలను గ్రామ జనసేన కార్యకర్తలు ఆదివారం కలిసి వారికి ధైర్యం చెప్పి శ్రావ్య చేతికి రూ.ఐదు వేలు నగదును అందించారు. కార్యక్రమంలో జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎం.వినయ్‌కుమార్, తామాడ వినయ్ కుమార్, సునీల్ పావన్ పాల్గొన్నారు.

'108' తనిఖీ

పలాస: మండల కేంద్రంలో 108 వాహనాన్ని డివిజన్ ఆపరేషన్ అధికారి గండేపల్లి జగన్నాథరావు ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. వాహన నిర్వహణ తీరు, పరికరాల పనితీరు, అత్యవసర మందుల నిర్వహణ రికార్డులను, డ్యూటీ చార్ట్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మరింత మెరుగైన సేవలు అందించాలని, అత్యవసర సమయంలో మరింత బాధ్యతగా పనిచేయాలని సూచించారు. 108 సిబ్బంది బి.తారకేశ్వరరావు, పి.తిరుపతిరావు, ఎన్.రాజారావు, ఎం.రామచంద్రరావు పాల్గొన్నారు.

నాగభూషణంకు నివాళి

కొత్తూరు: స్థానిక కలమట కాంప్లెక్స్‌లో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి భర్త రెడ్డి నాగభూషణం వర్ధంతిని వైసిపి నాయకులు ఆదివారం నిర్వహించారు. ముందుగా నాగభూషణం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కె.భాగ్యవతి, ఎంపిపి సవర సావిత్రి, ఎంపిటిసి వి.లక్ష్మీనారాయణ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ ప్రతినిధి మొజ్జాడ చక్రపాణి, వైసిపి నాయకులు కలమట రమేష్, జి.ఆనందరావు, పిన్నింటి రామారావు నాయుడు, సారిపల్లి తిరుపతిరావు, రాడ రాజు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

సంతబొమ్మాళి: మండలంలోని బడేకుప్పన్నపేట కేంద్రంగా పనిచేస్తున్న కెపి స్పందన ఫౌండేషన్ సభ్యులు టెక్కలి వీధికి చెందిన బర్ల కృష్ణకు నెలకు సరిపడా 25 కేజీ బియ్యం, 25 రకాల వంట వస్తువులు, రూ.1500 నగదు ఆదివారం అందజేశారు. కృష్ణ బతుకుతెరువు కోసం హైదరాబాద్‌లో పనిచేసేవారు. అక్కడ జరిగిన ప్రమాదంలో గాయపడ్డారు. చికిత్స అనంతరం స్వగ్రామానికి చేరుకున్నారు. ప్రస్తుతం ఇల్లు కదలలేని పరిస్థితి ఉండడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉంది. దీంతో ఫౌండేషన్ సభ్యులు ఆదుకున్నారు. షణ్ముఖ మాస్టర్, సిమ్మన్న, జి.శివారెడ్డి, సింహాచలం పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

ఆమదాలవలస: మండలంలోని నెల్లిపర్తిలో గురు పౌర్ణమి సందర్భంగా సత్యసాయి సమితి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 250 మందికి అన్ని రకాల వ్యాధులకు వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో ఎస్.వి.గురుప్రసాద్, ఆర్.కిషోర్, పద్మావతి, అచ్యుతరావు మాస్టర్, ఎం.జనార్దనరావు, డాక్టర్ పి.తాతయ్యలు, సి.హెచ్.సూర్యారావు, సూర రామచంద్రరావు, పి.నాగేశ్వరరావు, ఎం.రవీంద్రబాబు పాల్గొన్నారు.

లైన్ షోయింగ్ పద్ధతి పాటించాలి

ఆమదాలవలస: మండలంలోని చేపేనపేటలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా రైతులతో వరి సాగులో లైన్ షోయింగ్ పద్ధతిలో వరినాట్లు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎల్‌టు డిజిటల్ అసిస్టెంట్ సురేష్ వేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరుస క్రమంలో వరినాట్లు వేసుకుంటే అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి రేవతి ఆదేశాల మేరకు చేపేనపేటలో గత రెండేళ్ల నుంచి రైతులతో వరుస క్రమంలో వరినాట్లు వేయిస్తున్నామని తెలిపారు. ఈ విధంగా లైన్ షోయింగ్ విధానంలో వరిసాగు చేయడం వలన పంటకు గాలి, వెలుతురు బాగా తగిలి పంటకు పురుగులు, తెగుళ్లు రాకుండా మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. అలాగే ఈ ఏడాది కూడా గ్రామంలో రైతులందరూ లైన్ షోయింగ్ పద్ధతిలో వరిసాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చిరంజీవి, తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గురువు స్థానం గొప్పది

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యానేర్పిన గురువును సత్కరించుకోవడం సత్సంప్రదాయమని, జన్మనిచ్చిన తల్లిదండ్రుల కంటే గురువు స్థానం గొప్పదని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీ తరణి కృష్ణ స్మారక ధార్మికసేవ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆదివారం నగరంలోని బాపూజీ కళా మందిరంలో నిర్వహించిన సత్కార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గురుపౌర్ణమి సందర్భాన్ని పురస్కరించుకుని కళాప్రవీణ బండారు చిట్టిబాబును ఎమ్మెల్యే గొండు శంకర్ చేతులమీదుగా సత్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, సేవాతత్పరతే లక్ష్యంగా పలు రంగాల్లో సేవలందిస్తున్న శ్రీ తరణి కృష్ణ స్మారక ధార్మికసేవ ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. బండారు చిట్టిబాబు వంటి కళాకారుడిని సత్కరించే అవకాశం కలగడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, వివిధ డివిజన్‌ల ఇన్‌ఛార్జిలు, నిర్వాహకులు, కళాభిమానులు పాల్గొన్నారు.



చిట్టిబాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన పలువురికి సత్కారం

సమాజంలో మంచి మానవతా విలువలు కలిగిన పౌరులను తీర్చిదిద్దడంలో గురువు పాత్ర ఎంతో కీలకమని స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పిజి గుప్తా, ఎస్.జోగి నాయుడు, డాక్టర్ ఎం.వాసుదేవాచారి అన్నారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు ఇందిరా ప్రసాద్ పవనపుత్ర నడక సంఘం గౌరవ అధ్యక్షులు బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి గేదెల వెంకటప్పల నాయుడును సత్కరించారు. కార్యక్రమంలో బలదేవ్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు రాజీవ్.తో పాటు క్లబ్ ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, బి.దేవీప్రసాద్, కూన వేణుగోపాలరావు పాల్గొన్నారు.

కెజిబివిల్లో సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి




మాట్లాడుతున్న ధర్మేంధర్ రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కెజిబివిల్లో పనిచేస్తున్న భోధన, బోధనేతర సిబ్బంది సమస్యలు సత్వరమే పరిష్కరించాలని డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మేంధర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ప్రైవేట్ హోటల్‌లో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కార్యవర్గ సమావేశం పూజారి హరిప్రసన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు, గౌరవాధ్యక్షులు కోత ధర్మారావు, విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ము అప్పలరాజు, మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతాడ రఘురామస్వామిలు హాజరై మాట్లాడారు. గతేడాది కెజిబివిల్లో గెస్ట్ ఫ్యాకల్టీలుగా పనిచేసిన ఉపాధ్యాయులను ఈ విద్యా సంవత్సరంలో ఇంతవరకు విధుల్లోకి తీసుకోలేదని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకుని కొనసాగించాలన్నారు. కెజిబివిల్లో బోధన, భోదనేతర సిబ్బందికి మూడు నెలల బాండ్ విధానం రద్దు చేయాలన్నారు. గతేడాది కాంట్రాక్టు పిజిటి, కెమిస్ట్రీ సబ్జెక్టులో జరిగిన అవకతవకలు సరిచేయాలన్నారు. కెజిబివి సిబ్బందికి ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలన్నారు. బోధనేతర సిబ్బందిని ఆప్కాస్ పొరుగు సేవల సంస్థ నుంచి తప్పించి 2018 మునుపటి మాదిరిగా కాంట్రాక్టు పద్ధతిలో నియామకాలు చేపట్టాలన్నారు. ఇటీవల ట్రైబుల్ వెల్ఫేర్ సంచాలకులు ఇచ్చిన నైట్‌హాల్ట్ సర్క్యులర్ ఉపసంహరించాలన్నారు. ఐటిడిఎ పరిధిలో అప్‌గ్రేడ్ అయిన పండిత వ్యాయామ ఉపాధ్యాయులకు ఆరు నెలలుగా నిలిచిపోయిన జీతాలు చెల్లించాలన్నారు. మినిమం టైం స్కేల్ (ఎమ్‌టిఎస్) వారికి రెగ్యులర్ స్కేల్ మంజూరు చేస్తూ ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలన్నారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉపాధ్యాయులకు 117 జిఒను తక్షణమే రద్దు చేస్తూ ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో గురుగుబెల్లి భాస్కరరావు వందన సమర్పణ చేశారు.

'ధర్మరాజు'... శివరామప్రసాద్ మాస్టారు

ప్రజాశక్తి- కవిటి



శివరామప్రసాద్

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని వీరఘట్టం మండలం తలవరంలో 1962 జులై 31న కడారు గంగారావు, వెంకటరత్నం దంపతులకు కడారు శివరామ ప్రసాద్ అలియాస్ ధర్మరాజు మాస్టర్ జన్మించారు. వాస్తవానికి ఒక భూస్వామ్య కుటుంబం నుంచి వచ్చిన ఆదర్శనీయ ఉపాధ్యాయుడు. దాని ప్రభావం తన పిల్లలపై పడకుండా వారిని తీర్చిదిద్దారు ధర్మరాజు మాస్టర్ తండ్రి గంగారావు. నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్న గంగారావు వారిలో శివరామ ప్రసాద్‌ను వైద్య విద్య చదివించాలని ఆశించారు. కానీ, శివరామ ప్రసాద్ టిటిసి పూర్తిచేసి ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నారు.

వృత్తి జీవితం

విశాఖపట్నం జిల్లా కోటవురట్ల మండలం నీలిగుంటలో 1990 మార్చి రెండవ తేదీ ప్రత్యేక ఉపాధ్యాయునిగా ఉద్యోగ జీవితం ప్రారంభించిన శివరామ ప్రసాద్ అలియాస్ ధర్మరాజు 1990 సెప్టెంబరు 18న విశాఖ జిల్లా మాకవరపాలెంలో శాశ్వత ప్రభుత్వ ఉపాధ్యాయునిగా మారారు. ఆ తర్వాత 1992లో జరిగిన అంతర్ జిల్లాల బదిలీల్లో శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం వాల్లెపేటలో ఆగస్టు 13న విధుల్లో చేరారు. ఆ తర్వాత 1994లో పాలకొండ మండలం గుడివాడ, బుక్కురు, టి.డి.పారాపురం, బుక్కూరు, పనుకువలస తదితర పాఠశాలల్లో ఉపాధ్యాయునిగా సేవలందించారు. ఆ తర్వాత 2019 నవంబరు 1వ తేదీన కవిటి మండలం నెలవంకలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఎల్ఎఫ్.ఎల్ ప్రధానోపాధ్యాయునిగా బదిలీపై వచ్చారు. ప్రస్తుతం అదే పాఠశాలలో ఉద్యోగ విరమణ చేస్తున్నారు.

కుటుంబ నేపథ్యం

ధర్మరాజు మాస్టారు మొదటి భార్య నాగ షణ్ముఖమణి 2002లో కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. వీరికి ముగ్గురు సంతానం. పెద్దబ్బాయి డాక్టర్ కడారు భగవాన్ భార్గవకృష్ణ రాజాంలో వైద్యునిగా విధులు నిర్వహిస్తున్నారు. కోడలు డాక్టర్ హరితశ్రీ ఎంబిబిఎస్ ఎండి జనరల్ మెడిసిన్. జి.సిగడాం ప్రభుత్వ వైద్యురాలిగా సేవలందిస్తున్నారు. కూతురు కోసూరు సత్యప్రకాశ షర్మిల, అల్లుడు కోసూరు నాగేంద్రప్రసాద్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. మొదటి భార్య మృతి తర్వాత మాస్టారు సత్యవతిని రెండో వివాహం చేసుకున్నారు. వీరికి కడారు గంగాధర ధీరజ్‌కృష్ణ అనే కుమారుడు ఉన్నాడు. ధీరజ్ కృష్ణ రాజాం జిఎంఆర్ కంప్యూటర్ ఇంజనీర్ చదువుతున్నాడు.

చేతల్లోనూ ధర్మరాజే...

ఉన్నత కుటుంబం నుంచి వచ్చిన శివరాం ప్రసాద్ అలియాస్ ధర్మరాజు మాస్టర్ చేతల్లోనూ నిజంగా ధర్మరాజే అనిపించుకున్నారు. తన వృత్తి జీవితంలో ఎంతోమంది పేద విద్యార్థుల చదువుకు సహకరించిన మాస్టారు ఆపద అనుకుంటూ తన వద్దకు వచ్చే వారిని ఒట్టి చేతులతో పంపించరని అతను పనిచేసిన గ్రామాలతో పాటు తాను నివసించే మండలంలోనూ హితోక్తి. ముఖ్యంగా సామాజిక సేవలో ముందుండే మాస్టారు తన సొంత గ్రామమైన తలవరంలో పార్టీలకు అతీతంగా రామాలయం, శివాలయం నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించారు. తన సొంత డబ్బులతో సరస్వతి దేవి విగ్రహం నిర్మించి పాఠశాలలో పనిచేస్తున్న వంట మనిషి కూతురుని వాలంటీరుగా నియమించి ప్రతినెలా తానే సొంతంగా జీతం చెల్లిస్తున్నారు.